సాక్షి
కామారెడ్డి
గురువారం । 7 । మార్చి । 2024



అండగా నిలవండి

ఆడపిల్లలకు అందరూ అండగా ఉండాలని సఖి కేంద్రం జిల్లా ఇన్‌చార్జి అధికారి భారతి సూచించారు.

- 9లో ▸



చేతివృత్తులకు చేయూత

చేతివృత్తులవారికి చేయూతనందించేందుకు ఉద్దేశించిన ప్రధానమంత్రి విశ్వకర్మ పథకానికి దరఖాస్తులు వెల్లువెత్తాయి.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.3 /20.8

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వేములవాడకు ప్రత్యేక బస్సులు

ఖలీల్‌వాడి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నిజామాబాద్ రీజియన్ పరిధిలోని డిపోల నుంచి వేములవాడకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్‌ఎం జానీరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే నిజామాబాద్ జిల్లా కేంద్రం నుంచి లొంక, కామారెడ్డి నుంచి మద్దికుంట, సంతాయిపేట్‌కు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి



లింగంపేట: ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల భూమి పరిస్థితి తెలుస్తుందన్నారు. పరీక్ష ఫలితాల ఆధారంగా వ్యవసాయ అధికారులు ఇచ్చే సూచనలను పాటించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని సూచించారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకే ఎరువులు వాడాలన్నారు. అనంతరం 20 మంది రైతులకు మట్టి నమూనా చేసే కిట్లను అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు రత్నం, భారతి, అనిల్ కుమార్, ప్రశాంత్‌కుమార్, రత్నాకర్, రైతులు విఠల్, సక్రు, చందర్, నవాస్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నిజాంసాగర్ నీటి విడుదల

బాన్సువాడ: నిజాంసాగర్ ప్రాజెక్టునుంచి గురువారం నీటిని విడుదల చేయనున్నారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 10వ తేదీన నీటిని విడుదల చేయాల్సి ఉంది. అయితే ఆయకట్టు రైతుల కోరిక మేరకు ముందుగానే నీటిని విడుదల చేయాలని సర్కారు నిర్ణయించిందని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చివరి ఆయకట్టు వరకు ప్రతి గుంటకు నీరందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. మూడు రోజుల ముందుగానే నీటిని విడుదల చేస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు బల్దియా సమావేశం

కామారెడ్డి టౌన్: కామారెడ్డి బల్దియా సాధారణ సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో సమావేశం ఉంటుందని బల్దియా చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 23న నిర్వహించిన సమావేశం వాయిదా పడిన విషయం తెలిసిందే. గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొనాలని కోరారు.

11న ఉద్యోగ మేళా

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈనెల 11న ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. టీఎస్‌కేసీ, ది టైమ్స్ ప్రో సౌజన్యంతో ఆక్సిస్, ఐసీఐసీఐ, ఎస్, యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో శాశ్వత ప్రాతిపదికన నియామకాల కోసం ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు. ఏదైన డిగ్రీ లేదా బీటెక్‌లో కనీసం 50 శాతం మార్కులతో పాసైన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు 11వ తేదీన విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో రావాలని, ఇతర వివరాలకు 81067 64653 నంబర్‌లోగానీ, కళాశాల టీఎస్‌కేసీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లిష్‌లో గానీ సంప్రదించాలని సూచించారు.


తెరుచుకున్న మాధవనగర్ రైల్వే గేట్



నిజామాబాద్ రూరల్: మాధవనగర్ రైల్వే గేట్ బుధవారం తెరుచుకుంది. మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల్లో భాగంగా పిల్లర్లు, అప్రోచ్ రోడ్డు పనుల కోసం నెలన్నరపాటు గేటు మూసివేశారు. ఆ పనులు పూర్తవడంతో బుధవారం రైల్వేగేటును తెరిచారు. రైల్వే గేటు ప్రారంభం కావడంతో జిల్లా కేంద్రం నుంచి వెళ్లే ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

‘గులాబీ’లు డీలా!

ఉద్యమాల్లో రాటుదేలిన గులాబీ సైన్యంలో నైరాశ్యం అలుముకుంది. అసెంబ్లీ ఎన్నికల ఓటమినుంచి ఆ పార్టీ తేరుకోలేకపోతోంది. ప్రజాప్రతినిధులు, నేతలు ఒక్కరొక్కరుగా కారు దిగి వెళ్లిపోతుండడం, ఉన్నవారికి ధైర్యం చెప్పే నేతలు లేకపోవడంతో శ్రేణులు మరింత డీలా పడుతున్నాయి. దీంతో ప్రతిపక్షంగా మారిన తర్వాత చేపట్టిన తొలి నిరసన కార్యక్రమానికి స్పందన కరువైంది. – సాక్షి, కామారెడ్డి



- ఎల్‌ఆర్‌ఎస్‌పై నిరసనలకు బీఆర్‌ఎస్ పిలుపు
- జిల్లా కేంద్రంలోనే ఆందోళన
- మిగతా చోట్ల కరువైన స్పందన
- తుస్సుమన్న తొలి నిరసన కార్యక్రమం

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బాన్సువాడ నియోజక వర్గంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి విజయం సాధించారు. జుక్కల్ నియోజకవర్గంలో అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో జాజాల సురేందర్‌కు భారీ పరాజయం ఎదురైంది. కామారెడ్డి నియోజకవర్గంలో గంప గోవర్ధన్ కాకుండా అప్పటి సీఎం కేసీఆర్ బరిలో దిగినా ఓటమి తప్పలేదు. పార్టీ పరాజయంతో బీఆర్‌ఎస్‌లో జోష్ కరువైంది. గతంలో పార్టీ అధిష్టానం పిలుపు ఇస్తే ఏ కార్యక్రమాన్నైనా విజయవంతం చేయడానికి కార్యకర్తలు ఉత్సాహంగా కదిలివచ్చేవారు. పదేళ్ల పాటు అధికారంలో కొనసాగిన ఆ పార్టీ.. ఇటీవలి ఎన్నికల్లో ఓటమిపాలైన తర్వాత శ్రేణులకు ధైర్యాన్ని చేప్పేవారు కరువయ్యారు. పదవుల కోసం కొందరు, పనుల కోసం మరికొందరు పార్టీని వీడి వెళ్లారు. మిగిలిన వారు కూడా నైరాశ్యంలో ఉన్నారు.

నైరాశ్యంలో శ్రేణులు..

బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఎల్‌ఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ పార్టీ విమర్శలు చేసింది. అధికారంలోకి వస్తే ఉచితంగా క్రమబద్ధీకరిస్తామని పేర్కొంది. అయితే బీఆర్‌ఎస్‌ను ఓడించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఆ హామీని పక్కన పెట్టింది. చార్జీలు తీసుకుని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించడానికి చర్యలు చేపట్టింది. దీనిని బీఆర్‌ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. గతంలో చెప్పినట్లుగా ఉచితంగా భూములు క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తున్నారు. భూములను ఉచితంగా క్రమబద్ధీకరించాలన్న డిమాండ్‌తో బుధవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గకేంద్రాల్లో ఆందోళనలకు పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చింది. అయితే జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ఒక్క కామారెడ్డిలో మాత్రమే నిరసన కార్యక్రమం జరిగింది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న బాన్సువాడలోనూ నిరసన కార్యక్రమం చేపట్టలేదు. ఎల్లారెడ్డి, జుక్కల్‌లలోనూ ఇదే పరిస్థితి. దీంతో అధికారం కోల్పోయిన మూడు నెలల్లోనే గులాబీ క్యాడర్‌లో నైరాశ్యం అలుముకున్నట్టు స్పష్టమవుతోంది. చాలామంది నాయకులు పార్టీని వీడి వెళ్తుండడం కూడా ఇందుకు కారణంగా చెబుతున్నారు.

కామారెడ్డిలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గంప

ఎల్‌ఆర్‌ఎస్‌లో చార్జీల వసూళ్లను నిరసిస్తూ నియోజక వర్గ కేంద్రాల్లో బీఆర్‌ఎస్ ఆందోళనలకు పిలుపునిచ్చింది. నాలుగు అసెంబ్లీ నియోజక వర్గాలు ఉండగా ఒక్క కామారెడ్డిలోనే నిరసన కార్యక్రమం జరిగింది. మిగతా చోట్ల నేతలు పోరు బాట పట్టలేదు. కామారెడ్డి నియోజక వర్గ కేంద్రంలోని బల్దియా వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, జిల్లా పార్టీ అధ్యక్షుడు ముజీబొద్దీన్, మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి పాల్గొన్నారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల నేతలు, కార్యకర్తలు కూడా హాజరయ్యారు. ఎల్లారెడ్డి నియోజక వర్గ కేంద్రంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఎల్‌ఆర్‌ఎస్ కోసం చార్జీలు వసూలు చేయవద్దని డిమాండ్ చేశారు. బాన్సువాడలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి హైదరాబాద్‌లో ఉండడంతో నిరసన కార్యక్రమం నిర్వహించలేదు. అలాగే జుక్కల్ నియోజకవర్గంలో కూడా ఎలాంటి నిరసన కార్యక్రమాలు జరుగలేదు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు ఫీజు వసూలు చేయొద్దు

కామారెడ్డి టౌన్: ఎలాంటి ఫీజు లేకుండా ఎల్‌ఆర్‌ఎస్(లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం) అమలు చేయాలని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నేత గంప గోవర్ధన్ డిమాండ్ చేశారు. పార్టీ అధిష్టానం పిలుపుమేరకు బుధవారం కామారెడ్డి నియోజకవర్గ కేంద్రంలో ధర్నా చేశారు. కార్యక్రమంలో గంప మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద, మధ్య తరగతి కుటుంబాలను దోచుకుంటోందని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి ఫీజు తీసుకోకుండా ప్లాట్లను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి, నియోజకవర్గంలోని నాయకులు పాల్గొన్నారు.



కామారెడ్డి బల్దియా వద్ద ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

దూకుడు పెంచిన పాటిల్!

- హ్యాట్రిక్ గెలుపే లక్ష్యంగా జహీరాబాద్ ఎంపీ ప్రయత్నాలు
- పాత సహచరులతో మంతనాలు

సాక్షి, కామారెడ్డి: ఇటీవలే బీజేపీలో చేరిన జహీరాబాద్ సిట్టింగ్ ఎంపీ దూకుడు పెంచారు. హ్యాట్రిక్ విజయమే లక్ష్యంగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. పాత పార్టీలోని సహచరులతో మంతనాలు జరుపుతూ మద్దతు కూడగట్టుకునేందుకు యత్నిస్తున్నారు.

బీబీ పాటిల్.. 2014 సార్వత్రిక ఎన్నికల ముందువరకు జిల్లాలో పెద్దగా ఎవరికీ తెలియని వ్యక్తి. ఆయన పుట్టి పెరిగిన జుక్కల్ ప్రాంతంలో కూడా.. మహారాష్ట్రలో నిర్మాణరంగంతో పాటు వివిధ బిజినెస్‌లు చేసుకునే పాటిల్‌కు తెలుగు మాట్లాడడం కూడా సరిగ్గారాదు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక ఆయన అనూహ్యంగా టీఆర్‌ఎస్‌లో చేరి, జహీరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి బరిలో నిలిచారు. 1.42 లక్షల ఓట్ల మెజారిటీతో గెలిచి తొలిసారి పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. ఆయన ఎంపీగా తన నియోజకవర్గంలో పర్యటించే ప్రయత్నాలు చేసినా.. స్థానిక ఎమ్మెల్యేలు ఆయన రాకుండా అడ్డుకున్నారన్న విమర్శలున్నాయి. దీంతో ఎంపీకి, ఎమ్మెల్యేలకు మధ్య గ్యాప్ కూడా పెరిగింది. టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకత్వంతో సన్నిహిత సంబంధాలుండడంతో పాటిల్‌కు 2019 ఎన్నికల్లోనూ టికెట్టు ఇచ్చారు. ఆ ఎన్నికల్లో బీబీ పాటిల్ ఓటమి అంచు వరకు వెళ్లి, 6,229 ఓట్ల మెజారిటీ బయటపడ్డారు. ఎమ్మెల్యేలు సహకరించడం లేదని ఆయన పలుమార్లు అనుచరుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. రెండోసారి గెలిచిన తర్వాత ఆయన అఅధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడమే తప్ప సొంతంగా నియోజకవర్గాల్లో తిరగలేకపోయారు. అప్పటి సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు జిల్లాలో పర్యటించినపుడు ఆయా కార్యక్రమాలకు హాజరవుతూ వచ్చారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రాంతాల్లో తనకంటూ కొంత బలగాన్ని తయారు చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి జాతీయ రహదారుల కోసం ఎప్పటికప్పుడు ప్రయత్నాలు చేయడం ద్వారా పలు రోడ్లను సాధించారు. జుక్కల్ మీదుగా వెళ్లే సంగారెడ్డి–నాందేడ్ హైవేను నాలుగు లేన్ల రహదారిగా నిర్మించడానికి కావలసిన నిధులు సాధించి రోడ్డు పనులు పూర్తి చేయించారు. అలాగే మెదక్ నుంచి ఎల్లారెడ్డి, బాన్సువాడ మీదుగా రుద్రూర్ వరకు హైవే నిర్మాణ పనులకు నిధులు సాధించారు. ఇటీవల ప్రధాని మోదీ ఈ పనులకు శంకుస్థాపన చేశారు. మరికొన్ని పనులకు ప్రతిపాదనలు చేయించారు.



బీజేపీలో చేరి... టికెట్టు సాధించి...

ఎంపీ బీబీ పాటిల్ బీజేపీలో చేరతారని కొంతకాలంగా ప్రచారం జరుగుతూ వచ్చింది. కేంద్ర మంత్రులు, బీజేపీ నాయకులతో సన్నిహిత సంబంధాలున్న పాటిల్ అందరూ ఊహించినట్లే పార్లమెంట్ ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్‌కు షాక్ ఇస్తూ పార్టీని వీడి బీజేపీలో చేరారు. ఆ మరుసటి రోజే బీజేపీ ఆయనకు టికెట్టు కేటాయించింది.

బలం పెంచుకునేందుకు..

బీజేపీలో చేరడంతోనే టికెట్టు సాధించిన బీబీ పాటిల్ అటు కాషాయ నేతలను కలిసి వారి మద్దతు కూడగట్టుకునే ప్రయత్నాలు చేస్తూనే.. మరోవైపు బీఆర్‌ఎస్‌లో తనతో కలిసి పనిచేసిన నాయకులతో మంతనాలు జరుపుతున్నారు. వీలైనంత ఎక్కువ మందిని కలిసి వారి మద్దతను సాధించే ప్రయత్నాలు చేస్తున్నారు. వారిని కమలం గూటికి తీసుకువచ్చే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. బీజేపీ టికెట్టు ఆశించిన వాళ్లను కూడా ఆయన కలిసి తనకు అండగా నిలవాలని కోరుతున్నారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం కల సాకారం చేసిన ప్రధాని మోదీని మరోసారి ప్రధానిని చేసుకునేందుకు అందరూ తనతో కలిసి నడవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లోని పలువురు నేతలతో ఆయన ఇప్పటికే చర్చలు జరిపినట్టు ప్రచారం జరుగుతోంది. బీఆర్‌ఎస్ ద్వితీయ శ్రేణి నేతలు పలువురు ఎంపీతో వెళ్లే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

ఓవరాల్ చాంపియన్ నిజామాబాద్

- ముగిసిన రాష్ట్రస్థాయి విద్యుత్ క్రీడాపోటీలు

నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి విద్యుత్ క్రీడా పోటీల్లో నిజామాబాద్ జట్టు అథ్లెటిక్స్‌లో ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఎస్‌ఈ రాపెల్లి రవీందర్ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్, టగ్ ఆఫ్ వార్, అథ్లెటిక్స్ పోటీలు మూడు రోజులుగా సాగాయి. ముగింపు టోర్నీకి ముఖ్య అతిథిగా ఎన్‌పీడీసీఎల్ హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ బి అశోక్‌కుమార్ హాజరై మాట్లాడారు. యాంత్రీకరణ జీవితంలో క్రీడలు ఎంతో అవసరమన్నారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎస్‌ఈ సూర్యానారాయణ, స్పోర్ట్స్ సెక్రటరీ గోపి, కోశాధికారి ఉత్తమ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి తోట రాజశేఖర్, గంగారాం నాయక్, సురేష్, మూర్తి, దినేష్, అనిల్, డీఈలు వెంకటరమణ, శ్రీనివాస్ రావు, రాజేశ్వర్‌రావు, ఉత్తం జాడే, విక్రమ్, ఏడీఈలు వీరేశం, లింబాద్రి, రిఫ్రిస్, దుర్గాప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఓవరాల్ చాంపియన్‌షిప్‌తో నిజామాబాద్ జట్టు

విజేత జట్లు

- టగ్ ఆఫ్ వార్‌లో విజేతగా నిజామాబాద్ జట్టు, రన్నర్‌గా హైదరాబాద్ సౌత్ జట్టు నిలిచింది.
- ఫుట్‌బాల్‌లో విజేతగా మహబూబ్‌నగర్ జట్టు, రన్నర్‌గా వరంగల్ జట్టు నిలిచింది.
- అథ్లెటిక్స్‌లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను నిజామాబాద్ జట్టు కైవసం చేసుకుంది.

‘బీజేపీ వెంటే మహిళలు’

రాజంపేట: దేశంలో మహిళలు బీజేపీ వెంటే ఉన్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార పేర్కొన్నారు. బీజేపీ జాతీయ శాఖ పిలుపు మేరకు బుధవారం రాజంపేట మండలం శివాయిపల్లి గ్రామ రెడ్డి కల్యాణ మండపంలో నారీ శక్తి వందన్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణతార మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నరేంద్ర మోదీ మరోసారి ప్రధాని కాగానే చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తారన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి బక్కి సంధ్య, బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, మహిళా మోర్చా అసెంబ్లీ కన్వీనర్ పావని, కౌన్సిలర్ మానస, బీజేపీ మండల అధ్యక్షుడు గంగారెడ్డి, నాయకులు సుష్మ, సరోజ, బాలమణి, యాదమ్మ, వరలక్ష్మి, హారిక, శ్యామల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అరుణతార

‘ఉపాధి’ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

బీబీపేట: ఎండాకాలంలో ఉపాధి హామీ పనుల్లో కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, దీనిపై వారికి అవగాహన కల్పించాలని జెడ్పీ డిప్యూటీ సీఈవో భాగ్యలక్ష్మి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూలీలకు వెంటవెంటనే బిల్లులు అందేలా చూడాలన్నారు. ప్రజా పాలన దరఖాస్తుల కౌంటర్లను పరిశీలించారు. అనంతరం బీబీపేట, శేరిబీబీపేట గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు. మధ్యాహ్న వేళలలో మొక్కలకు నీళ్ల పట్టకూడదని నర్సరీల నిర్వాహకులకు సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే నీళ్లు పట్టాలన్నారు. ఆమె వెంట ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్, ఎంపీవో కృష్ణ, సెక్షన్ అసిస్టెంట్ జయకృష్ణ, సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

‘రైతు నేస్తం’ సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

తాడ్వాయి: రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్చువల్‌గా ప్రారంభించారు. ఎర్రాపహాడ్‌లోని రైతు వేదికలో కలెక్టర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు రంగానికి సాంకేతికతను అనుసంధానం చేస్తూ రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధంగా చేపలు, పాడి పశువుల పెంపకం వంటివి చేపట్టాలన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి పొందేలా రైతులు నూతన విధానాలు అలవాటు చేసుకోవాలని సూచించారు. తొలి విడతలో రాష్ట్రంలోని 110 రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ వ్యవస్థను సమకూర్చారన్నారు. దశలవారీగా ఉగాది నాటికి రాష్ట్రంలోని మొత్తం 2601 రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం విస్తరిస్తారన్నారు. ప్రతి మంగళ, శుక్రవారాలలో నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొంటారని, రైతులు సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్తే పరిష్కారమార్గాలు చూపుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మి, మత్స్య శాఖ అధికారి వరదారెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ నల్లవెల్లి కపిల్ రెడ్డి, ఎంపీటీసీ జలంధర్‌రెడ్డి, తహసీల్దార్ రహీముద్దీన్, ఎంపీడీవో సయ్యద్ అలీ, ఏవో శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖుల పేర్లు ఉండేలా చూడండి

కామారెడ్డి క్రైం: ఓటరు జాబితాలో ప్రముఖుల పేర్లు గల్లంతు కాకుండా చూడాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. ఒకవేళ జాబితాలో లేకపోతే వారితో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేయించాలన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. అన్ని పార్టీల ప్రతినిధులు బూత్ స్థాయి ఏజెంట్లను తప్పనిసరిగా నియమించుకోవాలని సూచించారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రభాకర్‌రెడ్డి, నరేందర్, అనిల్ కుమార్, ఖాసీం అలీ, వినోద్, మదన్ లాల్ జాదవ్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

సమాజంలో మార్పునకు దోహదపడాలి

కామారెడ్డి క్రైం: మహిళలు ఇంటిని చక్కదిద్దిన విధంగానే సమాజంలో మార్పునకు దోహదపడాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ సేవలందించిన మహిళా ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ కేంద్ర సంఘం కార్యదర్శి నాగరాజు, జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, సహాధ్యక్షుడు చక్రధర్, కార్యదర్శి సాయిలు, కోశాధికారి దేవరాజు, ఉపాధ్యక్షులు, పోచయ్య, లక్ష్మణ్, సుజాత, సంయుక్త కార్యదర్శులు రాజిరెడ్డి, రాజ్యలక్ష్మి, నవిత తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి


కామారెడ్డి టౌన్: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందేలా చూడాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ వైద్యులకు సూచించారు. బుధవారం ఆయన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలను సందర్శించారు. రోగులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. త్వరలోనే అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతానని కలెక్టర్ పేర్కొన్నారు. రోగులు వ్యర్థ పదార్థాలను చెత్త డబ్బాలలోనే వేయాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సానిటేషన్ సిబ్బందికి సూచించారు. సానిటేషన్ ఏజెన్సీ ప్రతినిధులు రోజూ పనులను పర్యవేక్షించాలన్నారు. ఆర్‌వో ప్లాంట్ నుంచి వచ్చే వృథా నీటిని ఇతర పనులకు వినియోగించాలని సూచించారు. అనంతరం రాజీవ్‌నగర్‌లోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో ఉన్న మందుల వివరాలను తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లాకేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంసింగ్, డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మి, ఆర్‌ఎంవో శ్రీనివాస్, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.



జిల్లా ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ పాటిల్

శివరాత్రి వేడుకలకు ముస్తాబు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని బ్రహ్మకుమారీస్ ఓం శాంతి భవనంలో శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు చేశారు. భవనాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. శుక్రవారం సహస్ర జ్యోతిర్లింగాల దివ్య దర్శన కార్యక్రమం ఉంటుందని బ్రహ్మకుమారీలు తెలిపారు. శివరాత్రి సందర్భంగా ఆధ్యాత్మిక ప్రదర్శలు, మెడిటేషన్ కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు పాల్గొనాలని కోరారు.



కామారెడ్డిలో విద్యుత్ దీపాల వెలుగులో ఓం శాంతి భవనం

క్లుప్తంగా

బీఎస్పీకి అమర్‌నాథ్ రాజీనామా

బోధన్: ఉమ్మడి రాష్ట్రంలో హస్తకళల కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేసిన మండలంలోని పెంటాకుర్దు క్యాంప్ సొసైటీకి చెందిన ఎం అమర్‌నాథ్ బాబు బీఎస్పీకి రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) బోధన్ అభ్యర్థిగా ఆయన పోటీ చేశారు. బుధవారం పట్టణంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్, బీఎస్పీ మధ్య ఎన్నికల పొత్తువల్ల చోటుచేసుకునే రాజకీయ పరిణామాలతో తనకెలాంటి సంబంధం ఉండదని స్పష్టం చేశారు. ఇక తాను బీఎస్పీలో కొనసాగలేనన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సమస్యలపై ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని కలిసి చర్చిస్తానని తెలిపారు.

హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక



మోపాల్(నిజామాబాద్‌రూరల్): ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జూనియర్ హ్యాండ్ బాల్ క్రీడా పోటీలకు కంజర్ మహాత్మా జ్యోతి బాపూలే బాలుర గురుకుల విద్యార్థులు ఎంపికైనట్లు ఆర్‌సీవో సత్యనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు క్రీడాకారులతోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడు నవీన్‌ను కంజర్ పాఠశాలలో బుధవారం అభినందించారు. కంజర్ గురుకులం నుంచి ప్రణయ్, రుత్విక్, ప్రమోద్, శ్రీనివాస్ ఎంపికయ్యారని ఆర్‌సీవో తెలిపారు. రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ ఆదేశాల మేరకు ఈనెల 5న నవ్యభారతి గ్లోబల్ స్కూల్‌లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల జూనియర్ బాలుర హ్యాండ్ బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించగా, 60 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారితో జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 8 నుంచి 10వ తేదీవరకు వరంగల్‌లో నిర్వహించనున్న 45వ రాష్ట్రస్థాయి బాలుర హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొననున్నారు.

శివాలయంలో పూజలు



కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి శివాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు శశికాంత్‌శర్మ, శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో అర్చనలు, అభిషేకాలు చేశారు. శ్రీకాంత్‌రావు దంపతుల ఆధ్వర్యంలో శివస్వాములకు భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శివభిక్ష కమిటీ అధ్యక్షుడు నిట్టు నారాయణరావు, ప్రతినిధులు తన్నీరు శేఖర్, లద్దూరి లక్ష్మీపతియాదవ్, చిన్నోళ్ల గోపాల్‌రావు, గుడెల్లి రమణ, పెద్దొళ్ల శశిధర్‌రావు, సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక



లింగంపేట: ఉపాధి హామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక బుధవారం మండల పరిషత్ ఆవరణలో నిర్వహించారు. మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో 2022–23 సంవత్సరంలో చేపట్టిన పనులపై తనిఖీ నిర్వహించారు. చేసిన పనుల వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్లు వివరించారు. అధికారులు నామమాత్రంగా పరిశీలించారు. ఎంపీపీ గరీబున్నిసాబేగం, అడిషనల్ డీఆర్‌డీవో వామన్‌రావు, ఏపీడీ దత్తాత్రి, ఎంపీడీవో మల్లికార్జున్‌రావు, ఎంపీవో ప్రభాకరచారి, రవీందర్ పాల్గొన్నారు.

చేతివృత్తులకు చేయూత

- పీఎం విశ్వకర్మకు దరఖాస్తుల స్వీకరణ
- ఉచిత శిక్షణ, రూ.లక్ష రుణం అందజేత



బాన్సువాడ: చేతి వృత్తులపై ఆధారపడి జీవించే వారిలో నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు ఆర్థిక చేయుతనందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విశ్వకర్మ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందుకు అర్హుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఎంపికైన అభ్యర్థులకు వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరిచేందుకు ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు ప్రత్యేక డిజిటల్ గుర్తింపు కార్డులు జారీ చేయనున్నారు. అలాగే జీవనోపాధి మెరుగుపర్చుకునేందుకు వీరికి రూ.లక్ష రుణం అందించనున్నారు. ఈ పథకం కింద బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటి వరకు 18 రకాల చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న 620 మంది దరఖాస్తు చేసుకున్నారు.

దరఖాస్తు విధానం

ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలనుకునే చేతి వృత్తుల వారు ఆధార్, రేషన్‌కార్డు కలిగి ఉండాలి. ఆధార్ కార్డుకు లింకైన మొబైల్ నంబర్, బ్యాంకు ఖాతా తదితర వివరాలతో కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుకు జత చేయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసే సమయంలో ఓటీపీ, బయోమెట్రిక్ వివరాలు వెరిఫికేషన్ చేయాల్సి ఉంటుంది.

ప్రత్యేక శిక్షణ ఇలా..

ఈ పథకం కింద ఎంపికైన అభ్యర్థులకు వృత్తినైపుణ్య డిజిటల్ గుర్తింపు కార్డుతో పాటు ధ్రువీకరణ పత్రం అందజేస్తారు. ప్రాథమికంగా ఐదు రోజులు శిక్షణ ఇస్తారు. శిక్షణ సమయంలో రోజుకు రూ.500 చొప్పున చెల్లిస్తారు. అనంతరం 15 రోజుల పాటు ప్రత్యేక వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి ఉపాధి కోసం అవసరమైన టూల్ కిట్ కింద రూ.15 వేల ఆర్థిక సాయం అందజేస్తారు. అనంతరం లబ్ధిదారులకు మొదటి విడతగా రూ.లక్ష రుణం అందిస్తారు. ఆ నగదును తిరిగి 18 నెలలో చెల్లించాల్సి ఉంటుంది. రెండో విడతలో రూ.2 లక్షలు అందజేస్తారు. ఈ నగదుకు 36 నెలల్లో చెల్లించాల్సి ఉంటుంది.

పేదలకు సాయం చేయడం సంతోషం



మాలాంటి పేదలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం చేయడం చాలా సంతోషంగా ఉంది. విశ్వకర్మ పథకానికి దరఖాస్తు చేసుకున్నా. అధికారులు వచ్చి విచారించి పూర్తి వివరాలు సేకరించారు. గతంలో రాజకీయ నాయకుల కనుసన్నల్లో లబ్ధిదారులను ఎంపిక చేశారు. కానీ ఇప్పుడు అందరికి ఆర్థిక సాయం అందించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

– గణేశ్, బాన్సువాడ

కోరికలు తీర్చే వీరభద్రుడు



అడ్లూర్ ఎల్లారెడ్డిలోని వీరభద్రేశ్వర స్వామి ఆలయం

- శివరాత్రి రోజు లింగంపై సూర్యకిరణాలు
- దర్శనానికి తరలిరానున్న భక్తులు



ఆలయంలో లింగంపై పడుతున్న సూర్యకిరణాలు

సదాశివనగర్: మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో కొలువుదీరిన వీరభద్ర స్వామి ఆలయం ఎన్నో ప్రత్యేకతలకు నిలయం. ఇక్కడ స్వామి వారని భక్తితో ప్రార్థిస్తే కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. ఆలయంలో కొలువైన శివలింగంపై శివరాత్రి రోజు సూర్యకిరణాలు పడటం ఇక్కడి ప్రత్యేకత. ఆ సుందర దృశ్యాన్ని చూడటానికి భక్తులు తరలి రానున్నారు. ఆలయంలో శివపార్వతులు, భద్రకాళి, వీరభద్రులు, నందీశ్వరుడు, విజయగణపతి విగ్రహాలపై ఉషోదయ కిరణాలు పడటాన్ని మహాశివరాత్రి రోజున దర్శించుకోవచ్చు. మహాశివరాత్రికి ముందు, తర్వాత కొన్ని రోజులు ఇలా కిరణాలు పడుతాయి. సూర్యకిరణాలు గర్భాలయంలో పడడంతో విగ్రహాలు వెలిగిపోతుంటాయి.

అక్రమంగా 'కారుణ్య' పోస్టుపై ఇంటలిజెన్స్ ఆరా!

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం: అక్రమంగా 'కారుణ్య' పోస్టు శీర్షికన ఈనెల 5న 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై ఇంటెలిజెన్స్, విజిలెన్స్ వర్గాలు ఆరా తీసినట్లు తెలిసింది. నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి కారుణ్య నియామకమైన వ్యక్తి 11 సంవత్సరాలుగా కొనసాగుతున్నా జిల్లాస్థాయి అధికారులు తెలిసీ తెలియనట్లు నటిస్తున్నారని ఆ శాఖ ఉద్యోగులే అసహనం వ్యక్తం చేస్తున్నారు. 'సాక్షి'లో కథనం రావడంతో ఈ వ్యవహారంపై ఇంటెలిజెన్స్, విజిలెన్స్‌వర్గాలు పూర్తి వివరాలు సేకరించి ప్రభుత్వానికి అందజేయనున్నట్లు సమాచారం. సదరు ఉద్యోగి డిప్యుటేషన్ కాలం పూర్తయిన తరువాత కూడా భద్రాద్రి కొత్తగూడెంలో విధులు నిర్వహించారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండానే 2023లో ఏప్రిల్ నుంచి జూన్ వరకు విధులు నిర్వహించిన ఆయన దానికి సంబంధించి జులై 25న పైరవీ చేసుకొని వర్క్‌ఆర్డర్ తీసుకున్నారనే ఆరోపణలున్నాయి. అయితే, సాలూర పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య రోగ్యశాఖాధికారులను మేనేజ్ చేసుకోని వేతనం తీసుకున్నట్లు తెలిసింది.

ఏఈపై ఏడీఈ దాడి

- ఎస్టిమేషన్ విషయంలో విద్యుత్‌శాఖ ఉద్యోగుల గొడవ

నిజామాబాద్‌నాగారం/ఎడపల్లి: రియల్ ఎస్టేట్ వెంచర్ వర్క్‌కు సంబంధించి ఎస్టిమేషన్ విషయంలో విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఎడపల్లి ఏడీఈ, ఏఈకి మధ్య గొడవ జరిగింది. రెండు రోజుల క్రితం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. నిబంధనల ప్రకారం ఎస్టిమేషన్ వేస్తానని ఏఈ స్పష్టం చేయగా, తాను చెప్పిందే వినాలని.. ఇష్టం వచ్చినట్లు చేస్తే కుదరదని ఏడీఈ ఆదేశించాడు. ఏఈ ఎస్టిమేషన్ రూపొందించి.. ఏడీఈ చెప్పినట్లు ఎస్టిమేషన్ వేసినట్లు అందులో పేర్కొన్నాడు. ఓరల్‌గా చెబితే తాను చెప్పినట్లు ఎస్టిమేషన్ వేసినట్లు ఎందుకు పేర్కొన్నావని ఏడీఈ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఏఈపై చేయి చేసుకున్నాడు. ఈ క్రమంలో అక్కడే ఉన్న ఓ కాంట్రాక్టర్ ముక్కుకు కూడా గట్టిగా దెబ్బతగిలినట్లు తెలిసింది. సెక్షన్ ఆఫీస్‌లో ఓ కాంట్రాక్టర్ ముందే ఏఈని ఏడీఈ కొట్టడంతో అందరూ షాక్ గురయ్యారు.

విషయం తెలిసింది

ఏడీఈ, ఏఈ మధ్య గొడవ జరిగినట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం గొడవ జరిగినప్పటికీ..రాతపూర్వకంగా ఎవరూ ఫిర్యాదు చేయలేదు. ఫిర్యాదు అందగానే విచారణ చేపడతాం.

– ఎండీ ముక్తార్, డీఈ, బోధన్

అధికారులతో రైతుల వాగ్వాదం

- రసాభాసగా రూరల్ సొసైటీ మహాజన సభ



అధికారులతో వాగ్వాదం చేస్తున్న రైతులు

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ రూరల్ సొసైటీ మహాజన సభ బుధవారం రసాభాసగా సాగింది. సొసైటీలో అప్పటి సీఈవో శివరామరాజు, క్యాషియర్ భాస్కర్ దొంగ రశీదులు ఇచ్చి రైతులను మోసం చేశారని జిల్లా సహకార అధికారి శ్రీనివాస్ రావు నివేదిక అందించిన విషయం తెలిసిందే. ఈ నివేదిక మేరకు బుధవారం నగరంలోని కోట గల్లీలో గల సంఘ భవనంలో మహాజన సభ నిర్వహించారు. ఈ సమావేశానికి పాలకవర్గం, అధికారులు, రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు తమకు న్యాయం చేయాలని అధికారులతో వాగ్వాదం చేశారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. నకిలీ రశీదులతో రైతులను మోసం చేసింది అప్పట్లో పని చేసిన సీఈవో, క్యాషియర్లే అని తెలిపారు. ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేసి ఉన్నత అధికారులకు పంపారు. రైతులు మాట్లాడుతూ.. తాము లోన్ కట్టినా మళ్లీ నోటీసులు పంపారని వాపోయారు. నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

సినీ ఇండస్ట్రీలో రాణిస్తున్న శ్రీమన్నారాయణ

- 'వి లవ్ బ్యాడ్ బాయ్స్' చిత్రానికి రెండు పాటలు రాసిన జిల్లావాసి



నిజామాబాద్ సిటీ: సినీ ఇండస్ట్రీలో గేయ రచయితగా నిజామాబాద్‌కు చెందిన శ్రీమన్నారాయణాచార్య(విరాట్) రాణిస్తున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడైన విరాట్ హిందీ కవిగా తనదైన శైలిలో కవిత్వాలు వినిపించి పలు రాష్ట్రాల్లో పురస్కారాలు అందుకున్నారు. రాజు రాజేంద్రప్రసాద్ దర్శకత్వంలో ఇటీవల చిత్రీకరణ పూర్తి చేసుకున్న 'వి లవ్ బ్యాడ్ బాయ్స్' చిత్రానికి రెండు పాటలు రాయగా, అవి ప్రేక్షకులను ఎంతగానో అలరిస్తున్నాయి. గోదావరి, ఆనంద్, చందమామ సినిమాలకు సంగీతం అందించిన రాధాకృష్ణతోపాటు భూషణ్‌జాన్‌తో తెలుగు, హిందీలో పలు ఆల్బమ్స్ చేశారు. అలాగే సిరివెన్నెల సీతారామశాస్త్రి టీమ్ ప్రాజెక్టును విరాట్ హిందీలో రాశారు. శ్రీమన్నారాయణాచార్య మరిన్ని సినిమాలకు పాటలు రాసి, చిత్ర పరిశ్రమలో తనకంటూ చక్కని గుర్తింపు తెచ్చుకోవాలని జిల్లా ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.



వి లవ్ బ్యాడ్‌బాయ్స్ సినిమా పోస్టర్

పరిశోధనలకు సదస్సులు దోహదపడుతాయి



సదస్సులో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ యాదగిరి

నిజామాబాద్‌రూరల్(డిచ్‌పల్లి): భావితరాల పరిశోధనలకు తెలుగు సదస్సులు దోహదపడుతాయని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి అన్నారు. 'తెలుగు ప్రాచీన శాస్త్ర కావ్యాలు, లక్షణ గ్రంథాలు – సమాలోచన' అనే అంశంపై తెలంగాణ యూనివర్సిటీ తెలుగు అధ్యయన శాఖ, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు, భారతీయ భాషా సంస్థ మైసూర్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ సదస్సు రెండోరోజైన బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. తెలుగు శాస్త్ర కావ్యాలపై రెండు రోజులపాటు నిర్వహించిన చర్చ భావి తరాల పరిశోధకులకు ఉపయోగపడుతుందన్నారు. తెలుగు శాస్త్ర కావ్యాల్లో చెప్పబడిన వివిధ అంశాలను సహేతుకంగా నిరూపించడం ద్వారా వాటి ప్రామాణికతను పెంచవచ్చని పేర్కొననారు. సదస్సులో ప్రొఫెసర్లు మాడభూషి సంపత్‌కుమార్, కరిమిండ్ల లావణ్య, పి కనకయ్య, తెలుగు అధ్యయన శాఖ అధ్యక్షుడు సీహెచ్ లక్ష్మణచక్రవర్తి, సంధ్యారాణి, డాక్టర్ రాజిరెడ్డి మహేందర్‌రెడ్డి, డాక్టర్ పమ్మి సత్యనారాయణశాస్త్రి, కళ్యాడపు రమేశ్, రాధా సారంగపాణి, విజయ్, మృదుల నందవరం తదితరులు పాల్గొన్నారు.

కబ్జా, బెదిరింపుల కేసులో మరొకరి రిమాండ్

కామారెడ్డి క్రైం: దేవునిపల్లి శివారులో ప్లాట్లు కబ్జా చేయడమే కాకుండా బెదింపులు, దాడులకు పాల్పడిన ఘటనలో కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు ఈ నెల 3న ఇద్దరు ప్రజాప్రతినిధులు సహా నలుగురిని రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఈ కేసులో మొత్తం ఏడుగురిపై కేసు నమోదై ఉంది. మరో ముగ్గురిని రిమాండ్ చేయాల్సి ఉండగా బుధవారం ఉరుదొండ రవి కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్ రావు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

రుద్రూర్: పోతంగల్ మండలం హంగర్గా ఫారంలో ఐదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై సందీప్ బుధవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

'రైతు నేస్తం'లో పాల్గొన్న అధికారులు



నస్రుల్లాబాద్‌లో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, నాయకులు, రైతులు

నస్రుల్లాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం ప్రారంభించిన రైతు నేస్తం కార్యక్రమాన్ని నస్రుల్లాబాద్ రైతు వేదిక నుంచి అధికారులు, నాయకులు తిలకించారు. రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం చేసి, రైతులకు సాంకేతిక విధానాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ఉద్దేశమని వ్యవసాయ అధికారులు తెలిపారు. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నందు రెడ్డి, ఏఈవోలు శ్రావణ్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి



సత్యం (ఫైల్)

వర్ని: మండలంలోని సత్యనారాయణపురం గ్రామ శివారులో విశ్వనాథ్ సత్యం (44) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. జాకోరా క్రాస్ రోడ్డు పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడనే సమాచారం మేరకు ఘటనాస్థలాన్ని పరిశీలించామన్నారు. మృతుడు నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన వ్యక్తిగా గుర్తించామని తెలిపారు. మృతుడి భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. సాధారణ మరణమా.. లేక హత్య చేశారా? అని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

నవీపేట: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని బినోలకు చెందిన అయిటి గంగారాం(60) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ బుధవారం తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న గంగారాం ఈనెల 1న ఆత్మహత్యాయత్నం చేశాడని, కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారన్నారు. పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

యువతి ఆచూకీ లభ్యం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని కళ్యాణి గ్రామానికి చెందిన యువతి గత నెల 29వ తేదీన అదృశ్యం కాగా, ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన యువతి సుప్రియ హైదరాబాద్‌లోని ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు టెక్నాలజీ ఆధారంగా గుర్తించారు. సదరు యువతిని తల్లిదండ్రులకు అప్పగించామని ఎస్సై తెలిపారు. కేసును ఛేదించిన పీసీ మహేశ్‌ను సీఐ రవీందర్ నాయక్‌తో పాటు ఎస్సై అభినందించారు.

ఇసుక డంపులు స్వాధీనం



ఇందల్వాయి: మండలంలోని కొత్త కోరుట్ల తండాలో అక్రమంగా నిల్వ చేసిన సుమారు 10 ట్రాక్టర్ల ఇసుక డంపులను బుధవారం ఉదయం సీజ్ చేసినట్లు ఇన్‌చార్జి ఎస్సై మనోజ్ తెలిపారు. ఇసుకను రెవెన్యూ అధికారులకు అప్పగించామని, డంప్ చేసినవారి వివరాలు తెలియరాలేదని ఎస్సై అన్నారు. అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుక తరలిస్తే సమాచారం అందించాలని ఆయన కోరారు.

ఎర్తింగ్ పైపులు, వైర్లు చోరీ




ఎడపల్లి(బోధన్): మండలంలోని ఠానాకలాన్ శివారులో ఉన్న జైతాపూర్, బాపునగర్, ఠానాకలాన్ రైతులకు చెందిన వ్యవసాయభూముల్లోని ట్రాన్స్‌ఫార్మర్ల ఎర్తింగ్ పైపులు, వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి ఎత్తుకెళ్లారు. ఘటనాస్థలాన్ని ఎస్సై విక్రమ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పంటలు పొట్టదశలో ఉన్న సమయంలో నీరందకపోతే ఎండిపోతాయని, రెండు నెలలుగా అనేకసార్లు బోరుమోటార్ల వైర్లను దొంగలు ఎత్తుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు నిఘా పెట్టాలని కోరగా, రాత్రి వేళల్లో పెట్రోలింగ్ పెంచుతామని ఎస్సై రైతులకు హామీ ఇచ్చారు.

పెద్దమ్మ ఆలయంలో..

ఎడపల్లి(బోధన్): మండలంలోని అంబం (వై) గ్రామంలో ఉన్న పెద్దమ్మ ఆలయంలో దుండగులు బుధవారం చోరీకి పాల్పడ్డారు. హుండీలోని రూ.18వేల నగదుతోపాటు అమ్మవారి పుస్తె, కళ్లకు పెట్టిన వెండి తొడుగు, బొట్టు, మెట్టెలు ఎత్తుకెళ్లారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎడపల్లి పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని మహిళ హల్‌చల్



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హుస్నాబాద్ కాలనీలో గుర్తుతెలియని మహిళ బుధవారం హల్‌చల్ చేసింది. సుమారు 10 నుంచి 15 ఇళ్లలోకి చొరబడిన సదరు మహిళ తలుపులుమూసి లోపలి నుంచి గడియపెట్టుకొని ఇబ్బందులకు గురిచేసింది. స్థానికులు ఆమెను పట్టుకొని విచారించగా పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సైలు అశోక్, అజమ్మ కాలనీకి చేరుకొని మహిళను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలుశిక్ష

ఖలీల్‌వాడి: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వారిని కోర్టులు హాజరుపర్చగా, న్యాయమూర్తి సయ్యద్ ఖదీర్ ఒకరికి జైలుశిక్ష, ఆరుగురికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ వి వెంకటనారాయణ తెలిపారు. బుధవారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఆరుగురికి మొత్తం రూ.6100 జరిమానా విధించారన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి



మాట్లాడుతున్న సీఐ కృష్ణ

బాన్సువాడ రూరల్: శాంతి భద్రతల పరిరక్షణకు గ్రామస్తులు సహకరించాలని బాన్సువాడ పట్టణ సీఐ కృష్ణ కోరారు. బుధవారం రాత్రి ఆయన మండలంలోని హన్మాజీపేట్‌లో పర్యటించి గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనాలు నడిపేవారు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. పేకాడటం, గంజాయి, హుక్కా తాగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మాజీ సర్పంచ్ సుభాష్, నాయకులు బోనాల సాయిలు, దత్తు పాల్గొన్నారు.

సంతలో దొంగల చేతివాటం

సెల్‌ఫోన్లు, పర్సుల చోరీ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో ప్రతి బుధవారం పెద్ద ఎత్తున జరుగుతున్న సంతలో దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. పట్టణానికి చెందినవారితోపాటు పరిసరాల ప్రాంతాల ప్రజలు కూరగాయలు, ఇతర వస్తువులు కొనుగోలు చేసేందుకు సంతకు వస్తుంటారు. ఇదే అదునుగా దొంగలు సెల్‌ఫోన్లు, పర్సులతోపాటు ఇతర విలువైన వస్తువులను చోరీ చేస్తున్నారు. ప్రతి బుధవారం సంతలో చోరీలు మామూలు విషయం మారింది. సంత జరిగే ప్రాంతాలోకి వాహనాలు వస్తుండడంతో రద్దీ ఎక్కువవుతోంది. పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించడంతోపాటు నిఘా సారిస్తేనే చోరీలకు అడ్డుకట్టపడే అవకాశం ఉంది.

ఇటీవల జరిగిన చోరీలు..

- మామిడిపల్లికి చెందిన జీవన్, గంగామోహన్ కురగాయలు కొనుగోలు చేస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు రూ.20వేల విలువైన ఫోన్లను దొంగిలించారు.
- ఆర్మూర్‌కు చెందిన రమేశ్, శ్రీనివాస్ అనే వ్యక్తుల ఫోన్లను చోరీ చేశారు.

పోలీస్ బృందాలను ఏర్పాటు చేస్తాం

- రవికుమార్, ఎస్‌హెచ్‌వో, ఆర్మూర్ సంతలో చోరీలు జరుగకుండా పోలీసులు బృందాలను ఏర్పాటు చేస్తాం. నిఘాసారించి సెల్‌ఫోన్లు దొంగిలిస్తున్న వారిని పట్టుకుంటాం.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ మీ బంగారం తాకట్టులో ఉందా. వడ్డీ చెల్లించలేకపోతున్నారా. ఎటువంటి ఫైనాన్స్‌లో ఉన్నా బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకే కొనబడును. ఫోన్: 9550606222. [H-787736]

CHANGE OF NAME

■ I, BILLA GAYATHRI (Old Name) H.No. 6-25-24, Dubba, Nizamabad. Hence Changed my Name as VELPULA GAYATHRI W/o. VELPULA RAMESH (New Name) [Z-795695]

■ I, BILLA RAMESH (Old Name) H.No. 6-25-24, Dubba, Nizamabad. Hence Changed my Name as VELPULA RAMESH S/o. GANGADHAR (New Name) [Z-795696]

■ I, LAKKALATHNI BALAIAH (Old Name) H.No. 6-69, Basarnapally, Tadwai, Nizamabad. Hence Changed my Name as a LAKKAPATHINI BALAIAH (New Name) S/o. LAKKAPATHNI MALLAIAH. [Z-795697]

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 9059663584. [M-1233872]

■ హరేకృష్ణ హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18k ఫోన్: 9640258899 / 9640468899. [H-799851]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడి సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, వాచ్‌మెన్‌లు, భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901. [HA-13601]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.